ఇళ్లపై యమపాశాలు !

- 11కేవీ వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఇబ్బందులు
- ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజల ఆందోళన


సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో ఇళ్ల మధ్యలో ఉన్న 11 కేవీ లైన్


విద్యుత్ స్తంభానికి చుట్టుకున్న తీగలు


రొద్దంలో ఓ ఇంటిపై వెళ్లిన విద్యుత్ లైన్

సోమందేపల్లి: నియోజకవర్గంలోని పలు మండలాల్లో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. తక్కువ ఎత్తులో విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఎప్పుడేం జరుగుతుందో తెలీక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు సమస్యలను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహాలపై విద్యుత్ తీగలు వెళ్లడంతో అవసరాల కోసం మిద్దెల పైకి ఎక్కాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

అన్ని చోట్లా సమస్యలు

సోమందేపల్లి మండల కేంద్రంలోని దుర్గానగర్‌లో తక్కువ ఎత్తులో తీగలు వేలాడుతుండడంతో భారీ వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. వర్షాలు కురిసినా, లేకపోతే గాలి తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో విద్యుత్ తీగలు కిందకు పడిపోతున్నాయి. దీంతో ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు వణికిపోతున్నారు. అలాగే రొద్దం మండలం జగనన్న కాలనీలో అయితే ఓ ఇంటిపై నుంచి 11 కెవి విద్యుత్ లైన్ వెళ్లింది. దీంతో ఇంటి యజమాని జహీదాభాను కుటుంబ సభ్యులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. పెనుకొండ, గోరంట్ల, పరిగి మండలాల్లోని పలు ప్రాంతాల్లోనూ విద్యుత్ వైర్లు కింద వేలాడుతుండటంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఇంటిపైకి వెళ్లాలంటే భయం



జగనన్న కాలనీలో ఇంటిని నిర్మించుకున్నాము. అయితే మా ఇంటి పై నుంచి 11 కేవీ విద్యుత్ తీగలు వెళ్లాయి. దీంతో మిద్దె పైకి ఎక్కాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చేతికి అందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయి. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకొని విద్యుత్ లైన్ మార్చాలి.

– జహీదాభాను, రొద్దం

అధికారులు దృష్టికి తీసుకెళ్లాం



దుర్గానగర్‌లో విద్యుత్ లైన్లు చాలా కిందకు ఉన్నాయి. ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని తెలియని పరిస్థితి. విద్యుత్ లైన్ మార్చాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రమాదం జరగకముందే మా సమస్యను పరిష్కరించాలి.

– లక్ష్మీకాంత్, సోమందేపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం

వివిధ ప్రాంతాల్లోని విద్యుత్ సమస్యలు మా దృష్టికి వచ్చాయి. 11 కేవీ విద్యుత్ లైన్లు మార్చడం చాలా కష్టం. ఆయా ప్రాంతాల్లో ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. విద్యుత్ లైన్లు మార్చడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. దీంతో పాటు తిరిగి వేరే చోటికి లైన్ మార్చాలంటే స్థల సమస్య ఉత్పన్నమవుతుంది.

– శేషగిరిరావు, ట్రాన్స్‌కో ఏడీ, పెనుకొండ

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


కంబాలపల్లిలో ఘన జీవామృతం తయారు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ద్వారా పంటలు సాగు చేసి ఆదాయం పొందాలని డివిజన్ ప్రకృతి వ్యవసాయం కోఆర్డినేటర్ రమేష్ తెలిపారు. మండల పరిధిలోని కంబాలపల్లిలో మహిళ రైతు హనుమక్క పొలంలో ఘన జీవామృతం తయారు చేయించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్ టాప్ వితరణ

పావగడ: స్థానిక సమాజ సేవకుడు శాంతి మెడికల్స్ దేవరాజు పళవల్లి గ్రామంలోని పల్లవరాయ పాఠశాలకు ఉచితంగా రూ.65 వేలు విలువ చేసే ల్యాప్‌టాప్‌ను బుధవారం వితరణ చేశారు. అలాగే నాగలమడక గ్రామంలోని స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులకు యూనిఫాం దుస్తులు అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిందూపురం: పట్టణంలోని పరిగి బస్టాండు వద్ద బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మృతుడి ఆచూకీ, వివరాలు ఏమీ తెలియరాలేదన్నారు. వృద్ధుడిని ఎవరైనా గుర్తిస్తే హెడ్‌కానిస్టేబుల్ రవినాయక్ సెల్‌నంబర్ 919000063870ను సంప్రదించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి


ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: అయ్యప్ప మాలధారణతో 41 రోజులు దీక్ష చేసి స్వామివారి దర్శనంతో మనస్సు ప్రశాంతంగా ఉండటంతో పాటు సన్మార్గం అవవడుతుందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక అన్నారు. రాచపల్లిలో మహేంద్రరెడ్డి, తేజ ఇరుముడి కార్యక్రమాలకు నియోజకవర్గ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డితో కలిసి పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల జట్టు గెలుపు


సెంచరీ సాధించిన మూర్తిని అభినందిస్తున్న ఇంజనీర్ జగదీష్

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల జట్టు విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన జూనియర్ కళాశాల జట్టు 12 ఓవర్లలో 184 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సన్‌రైజ్ జట్టు 118 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. మ్యాచ్‌లో కళాశాల లెక్చరర్ మూర్తి 43 బంతుల్లో 105 పరుగులు చేసి సెంచరీ సాధించాడు.

రాగి మద్దతు ధర రూ.4,290

చిలమత్తూరు: ఖరీఫ్‌లో రాగి పండించిన రైతులకు ప్రభుత్వం మద్దతు కింటాలుకు ధర రూ.4,290గా నిర్ణయించినట్లు వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. 2024 ఖరీఫ్‌లో రాగి సాగు చేసి పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాలలో మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరి మృతి

- ముగ్గురికి తీవ్రగాయాలు


గాయపడిన ఓబుళప్ప


మృతుడు దాసరి మూర్తి

అమరాపురం: మండల పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందగా, ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వివరాలమేరకు... మండలంలోని మద్దనకుంట క్రాస్ సమీపంలో బుధవారం రాత్రి ద్విచక్ర వాహనం గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న ఓబుళలప్ప, మంజునాథ్ తీవ్రగాయాలపాలయ్యారు. వారిని మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే మద్దిహాళ్లి క్రాస్ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో దాసరి మూర్తి (50) మృతి చెందగా రాజు అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. రాజును చికిత్స నిమిత్తం కర్ణాటక రాష్ట్రం దావణగేరకు తరలించారు. వారు కుందిరిపి మండలం మలయనూరు గ్రామం నుంచి కర్ణాటక రాష్ట్రం శిర తాలూక్ కరిదాసనహళ్లిలో జరిగిన కరియమ్మ ఉత్సవంలో పాల్గొని తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది.

క్యాలెండర్ల ఆవిష్కరణ

అమరాపురం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో బుధవారం సాయంత్రం ఎంఈఓలు రాఘవయ్య, వెంకటరమణనాయక్ తదితరులు ఏపీటీఎఫ్ నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు అశోక్, కోశాధికారి హనుమంతరావు, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, సీనియర్ సభ్యులు కృష్ణారెడ్డి, నరసింహమూర్తి, చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

రొద్దం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఎంపీడీఓ రామ్‌కుమార్ చేతుల మీదుగా క్యాలెండర్లు విడుదల చేసినట్లు ఈఓఆర్డీ గోవిదంప్ప తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలి

రొళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్‌తో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఏ బకాయిలను వెంటనే విడుదల చేసి పీఆర్‌సీ కమిషన్ వేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కే.యంజారప్ప ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సాయంత్రం మండలంలో ఏపీటీఎఫ్ సభ్యత్వం చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో యంజారప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావస్తున్న ఉద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం ఎంఈఓ శ్రీధర్ చేతుల మీదుగా ఏపీటీఎఫ్ 2025 క్యాలెండర్లు, డైరీని విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండలాధ్యక్షుడు సుధాకర్, కార్యదర్శి ఆంజినేయులు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కమిటీ ఎన్నిక


వాసవీ క్లబ్ నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

హిందూపురం: జిల్లా వాసవీ క్లబ్ 2025 సంవత్సరానికి నూతన కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఎం.రాజేంద్ర గుప్తా, కార్యదర్శి దాసా విష్ణు, కార్యదర్శిగా హెచ్‌ఆర్ కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వాసవీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


నిరసన తెలియజేస్తున్న హిందూ సంఘాల ఐక్య వేదిక సంఘం సభ్యులు

హిందూపురం అర్బన్: హిందూపురం మున్సిపాలిటీ పరిధిలోని మోతుకపల్లి గ్రామంలోని శనేశ్వరస్వామి దేవాలయం ఆర్చ్ వద్ద ఉన్న శనేశ్వర స్వామి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈఘటనకు పాల్పడిన నిందితులను వెంటనే పట్టుకోవాలని బుధవారం ఆలయ అర్చకులు రాధాకృష్ణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విగ్రహన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలంటూ పోలీస్ స్టేషన్ ఆవరణలో దేవాలయ, హిందూ సంఘాల నాయకులు, మోతుకపల్లి గ్రామస్తులు నిరసన తెలిపారు.

బాలికల బంగారు భవితే లక్ష్యం

హిందూపురం టౌన్: కిశోరి వికాసం బాలికల బంగారు భవిష్యత్తుకు పునాది వేస్తుందని సీడీపీఓ శాంతి అన్నారు. బుధవారం పూలకుంట వద్ద గల ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీఓ అధ్యక్షతన కిశోరి వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిథులుగా ఈఓ ఆర్‌డీ శివకుమార్, డీఆర్‌డీఓ ఏపీఎం రామాంజినేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయమ్మ, అనిత, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి పూజలు

పావగడ: స్థానిక నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యస్వామి జాతరోత్సవాలను పురస్కరించుకొని బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు బదరీనాథ్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

రొళ్ల: గ్రామసభల ద్వారా రెవెన్యూ భూ సమస్యలను పరిష్కరిస్తామని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని దొడ్డేరి సచివాలయం ఆవరణలో రెవెన్యూ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ భూ సమస్యల పై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు.

ఉద్యాన సిబ్బందికి శిక్షణ

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఉద్యానశాఖ కార్యాలయంలో పెనుకొండ, సీకేపల్లి, రామగిరి, సోమందేపల్లి, రొద్దం మండాలలకు చెందిన అగ్రికల్చర్ అసిస్టెంట్లుకు బుధవారం మట్టి పరీక్షలు తదితర వాటిపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. రైతుల పొలాల్లో మట్టి పరీక్షలు నిర్వహించి, వాటి ఫలితాలను పదిహేను నిమిషాలలో ఎలా అందించాలో వివరించారు. ఉద్యానశాఖ అధికారి రాంప్రసాద్, డిజిట్ గ్రీన్ ప్రతినిధులు శ్రీకాంత్, ప్రవర్షిణి, హార్టికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేసుల నమోదులో జాప్యమెందుకో!

హిందూపురం అర్బన్: సామాన్య వ్యక్తి వద్ద ఓ బాటిల్ కర్ణాటక మద్యం దొరికితే హడావుడి చేసి వాహనాలు సీజ్ చేసి ప్రెస్ నోట్ రిలీజ్ చేసే ఎక్సైజ్ అధికారులు... మంగళవారం రాత్రి 12 బెల్ట్ షాపుల్లో నకిలీ మద్యంతో పట్టుబడిన 12 మందిపై బుధవారం రాత్రి అయినా కేసు నమోదు చేయకుండా ఉపేక్షించారు. విచారణ పేరుతో హిందూపురం ఎక్సైజ్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. బుధవారం రాత్రి వరకు తొమ్మిది మంది తమ అధీనంలోనే ఉంచుకుని ఎక్సైజ్ అధికారులు రాచమర్యాదలు చేసినట్లు సమాచారం. వారిపై కేసుల నమోదు కానీ, అరెస్ట్‌కాని చూపక పోవడంతో పలువురు విలేకరులు ఎక్సైజ్ సీఐని సంప్రదించారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదంటూ ఆయన దాట వేశారు. కాగా, టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి.

పట్టుచీరల వ్యాపారిపై కత్తితో దాడి

హిందూపురం అర్బన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన పట్టు చీరల వ్యాపారి నారాయణరెడ్డిపై దుండగులు కత్తితో దాడి చేసి గొంతు కోశారు. బుధవారం వేకువజామున ఈ ఘటన చోటు చేసుకుంది. అదే సమయంలో హిందూపురం నుంచి ముదిరెడ్డిపల్లికి వస్తున్న ఆటో డ్రైవర్... రోడ్డు పక్కన ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్న నారాయణరెడ్డిని గుర్తించి వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు ఆస్పత్రికి చేరుకుని ఆయన పరిస్థితిపై ఆరా తీశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. దాడికి కారణాలు తెలియాల్సి ఉంది.

శనేశ్వర స్వామి విగ్రహం ధ్వంసం


శనేశ్వర స్వామి విగ్రహం కుడి చేతిని పగులగొట్టిన దృశ్యం

హిందూపురం అర్బన్: స్థానిక మోతుకపల్లి సమీపంలో శనేశ్వర స్వామి ఆలయం ఆర్చ్ వద్ద ఏర్పాటు చేసిన స్వామి వారి రాతి విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఈ నెల 6, 7 తేదీల్లో ఈ ఆలయానికి సమీపంలోనే ఇస్తేమా జరిగింది. అయితే విగ్రహాన్ని ఎదరు ధ్వంసం చేశారు అనే అంశంపై స్పష్టత లేదు. ఆలయ నిర్వాహకుల నుంచి ఫిర్యాదు అందుకున్న వన్‌టౌన్ పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. కాగా, విగ్రహం ధ్వంసంపై విశ్వ హిందూపరిషత్, హిందూ సంఘాల నాయకులు మండిపడ్డారు. రాష్ట్రంలో హిందూ ఆలయాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు శనీశ్వర స్వామి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను తక్షణమే అరెస్ట్ చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దుద్దేబండలో నీరు వృథా



పెనుకొండ రూరల్: గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి కియా పరిశ్రమకు నీటిని అందించే పైపు పగలడంతో నీరు వృథా అవుతోంది. మండలంలోని దుద్దేబండ సమీపంలో నేషనల్ కంపెనీ ఎదురుగా నీటి సరఫరాను అందించే పైపులు పగిలాయి. మూడు రోజులు నుంచి నీరు వృథాగా పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

రేపు మడకశిర నుంచి పాదయాత్ర

మడకశిరరూరల్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఉదయం 7 గంటలకు మడకశిర పట్టణం నుంచి బాలాజీ పాదయాత్ర బృందం ఆధ్వర్యంలో రొళ్ల మండలం కొత్తపాళ్యంలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు కాలి నడకన పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.

పేదలకు వైద్యమందించడమే లక్ష్యం


సాయికాళేశ్వర్ చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న శిల్పా, కుమార్తె నవ్యశ్రీ

పెనుకొండ: నిరుపేదలకు నిరంతర వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ శిల్పా పేర్కొన్నారు. సాయి కాళేశ్వర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని శివసాయి మందిరంలో పేదలకు విదేశీయుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు ప్రారంభించారు. సాయి కాళేశ్వర్ చిత్రపటం వద్ద శిల్పతో పాటు ఆమె కుమార్తె నవ్యశ్రీ పూజలు చేశారు. 94 మందికి వినికిడి పరికరాలు, 125 మందికి చెవి ముక్కు గొంతు పరీక్షలు చేశారు. వంద మందికి చర్మ వ్యాధి పరీక్షలు, 60 మందికి పంటి పరీక్షలు, 60 మందికి ఫిజియోథెరపీ ఇచ్చారు. ఉచితంగా మందులు అందజేసారు. ఆశ్రమ సిబ్బంది హరి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు

మడకశిర: పట్టణంలోని షిరిడీసాయిబాబా ఆలయంలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, విశ్రాంత డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆ రోజు ఉదయం 7 గంటలకు సామూహిక భవద్గీత పారాయణంతో వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. ఆ తర్వాత ఉదయం 8 గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం జరుగుతుందని పేర్కొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ముద్దాయిలకు జైలు శిక్ష

మడకశిర: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ బుధవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి అశోక్‌కుమార్ తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాలమేరకు.. మడకశిర మండలంలోని కల్లుమర్రిలో 2022లో గణేష్ నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అయితే కల్లుమర్రికి చెందిన శివప్ప, పరిగి మండలం నరసాపురానికి చెందిన ప్రవీణ్ పోలీస్ విధులకు ఆటంకం కలిగించారు. ఈ ఘటనపై కానిస్టేబుల్ సుధాకర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ నాగేంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. ఈ కేసుపై కోర్టులో దాదాపు మూడేళ్ల పాటు విచారణ కొనసాగింది. ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితులైన శివప్ప, ప్రవీణ్‌కు జూనియర్ జడ్జి ఏడాది పాటు కఠిన జైలు శిక్ష, రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ విఠల్‌రావు వాదించారు.

మహిళలకు చట్టాలపై అవగాహన


నాటిక రూపంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని చిన్నమంతూరులో అనంతశక్తి సొసైటీ న్యాయ సలహా మండలి ఆధ్వర్యంలో బుధవారం మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. దిశ, గృహింస, వేధింపులు, బాల్యవివాహాలు, సమాజంలో మహిళలకు జరుగుతున్న వివక్ష తదితర చట్టాలపై మహిళలకు నాటిక రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అనంతశక్తి సొసైటీ సీఈఓ లావణ్య మాట్లాడుతూ ప్రతి మహిళా చట్టాలపై అవగాహనతో ఉండాలన్నారు. ఎక్కడైన మహిళలు గృహింస, వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

మామిడి మొక్కలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోండి

రొద్దం: మామిడి మొక్కలు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని రైతు పద్మావతి అధికారులకు విజ్ఞప్తి చేశారు. పద్మావతి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ రొద్దం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 166–13లో 4 ఎకరాల 85 సెంట్ల భూమిని తనకు 2007లో అసైన్‌మెంట్ కమిటీ ద్వారా ప్రభుత్వం ఇచ్చిందని రైతు పద్మావతి తెలిపారు. షరీఫ్ కుటుంబ సభ్యులకు సర్వే నంబర్ 166–14లో 4 ఎకరాల 10 సెంట్లు భూమి ఉందన్నారు. అతని పొలంలోకి తాను ఎక్కడా వెళ్లలేదన్నారు. అయితే షరీఫ్ కుటుంబ సభ్యులు తన పొలంలో మామిడి మొక్కలు నాటినట్లు, వారి పొలాన్ని తాను ఆక్రమించినట్లు తప్పుడు ఫిర్యాదు చేసి తన పొలంలో నాటిన మామిడి మొక్కలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ నాగేంద్రతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ గుత్తి – కర్నూలు ప్యాపిలి నేషనల్ హైవేకి ఉన్న మా ప్రాజెక్ట్ లో ప్రత్యేక ఆఫర్ కలదు.2.29 సెంట్లు ₹4లక్షలు. మార్కెటింగ్ కొరకు (గుత్తి లోకల్) సంప్ర 7207282392. [SCA25001027]

SERVICES

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల వ్యాపార, ప్రాజెక్ట్‌ల, వ్యక్తిగత, వ్యవసాయ, విద్య రుణాల సలహాలకు సంప్రదించండి DMA స్వాగతం. జీతం + కమీషన్. ✆ 9671637906. [T-298]

WANTED

■ మయూరి టైల్స్ & శానిటరీ షోరూం నందు పనిచేయుటకు అనుభవం కల సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం :15,000/- + ఇన్సెంటివ్స్ కలదు. బళ్లారి రోడ్, నియర్ సాయిబాబా టెంపుల్, ATP. సెల్: 98481 89744. [A-1470]

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్‌చేసి కాల్ చేయండి. 82478 08801. [M-0983558]

■ ATP లోకల్ లో, ఇల్లు, ఆఫీస్‌లు, ట్యాంక్‌లు, సంపులు, వాష్ రూమ్స్ క్లీనింగ్ బాయ్స్–2 కావలెను. పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్. సంప్రదించండి : సెల్ : 6300901599. [SCA25001113]

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ BELL INFRA ప్రాజెక్ట్ కొరకు అనుభవజ్ఞులైన మార్కెటింగ్ సిబ్బంది కావలెను. టీమ్ తో సహా వచ్చిన వారికి & హౌసింగ్ ప్రాజెక్ట్స్ నందు మార్కెటింగ్ చేయువారికి ప్రాధాన్యత. ప్రతి ఒక్క మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌కు ఖచ్చితమైన జీతం. ప్రారంభ వేతనం : 12,000 to 15,000. సంప్ర : 9989452444. [A-1473]

■ S.R. గ్రూప్స్ నందు పనిచేయుటకు 10th, ఇంటర్, డిప్లమా P/F 25 సం౹౹ల లోపు యువతి యువకులు కావలెను. సంపాదన నెలకు 12000 to 25000 రూ౹౹ల్, No Fees, No Experience సంప్ర: 7989389001. [C-1266127]

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256032]

■ PAYTM WANTED: FSE's, (జెంట్స్ మాత్రమే.) Q: 12th పాస్, శాలరీ: 21K + ఇన్సెంటివ్స్. ఆన్ రోల్ జాబ్. ఫ్రెషర్స్ / EXP. బైక్ + స్మార్ట్ ఫోన్ తప్పనిసరి. జాబ్ లోకేషన్స్: అనంతపురం : 63000 53339, 88616 50791, 93906 28290, 74164 98874. కదిరి&ముదిగుబ్బ : 97380 08754. ధర్మవరం & కొత్తచెరువు : 97003 03085. గుత్తి & ఉరవకొండ : 93989 46075. తాడిపత్రి : 9885719096. [A-1471]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ప్రతి 3 ప్రకటనలకు 1 ప్రకటన ఉచితం
ANANTHAPURAMU : 9010567770, 9492288307
DHARMAVARAM & PUTTAPARTHI : 9912220726
HINDUPUR & MADAKASIRA : 9912220723, 9705346587
GUNTAKAL & TADIPATRI : 9912220722
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



రాచూరులో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం: మండల పరిధిలోని రాచూరు గ్రామానికి చెందిన సోమశేఖర్‌రెడ్డి అనే యువకుడు రెండు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీరచణ్ బుధవారం గ్రామానికి చెరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం చేశారు. అధైర్య పడొద్దని, కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే బూచెర్లలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నీరుగంటి అంజినప్ప కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. అనంతరం బూచెర్ల, సానిపల్లిలో అయ్యప్పస్వాముల ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బి.తిమ్మయ్య, సర్పంచ్ రాము, నాయకులు ఎస్ నారాయణరెడ్డి, బోయ నరసింహులు, లక్ష్మీనారాయణరెడ్డి, సి.నారాయణరెడ్డి, వైశాలి జయప్పరెడ్డి, హనుమంరెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



కర్ణాటక మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద బుధవారం మారుతీ వ్యాన్‌ను సీజ్ చేసి అక్రమంగా తరలిస్తున్న 328 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ ప్రసాదరావు తెలిపారు. ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య ఆదేశాల మేరకు వాల్మీకి సర్కిల్‌లో తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎక్సైజ్ ఎస్‌ఐ శంకర్, సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో మారుతీ వ్యాన్‌లో కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తున్న మడకశిర ఎస్సీ కాలనీకి చెందిన నంజప్ప, మారుతీలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వారిని మడకశిర కోర్టులో హాజరుపరచగా జూనియర్ సివిల్ జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

హిందూపురం టౌన్: వేమన ఫౌండేషన్ సౌజన్యంతో వేమన శతక పద్యాల పోటీలను బుధవారం పట్టణంలోని శేఖర్ ట్యూషన్ అకాడమీలో నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రత్నగిరి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ, రమ్య, సరీదాభాను, నజ్రీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో 'ఆరోగ్యశ్రీ నిర్వీర్యం'

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



ఈరలక్కప్ప

గుడిబండ: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యశాఖలో విప్లవాత్మక సంస్కరణలను అమలు చేసింది. ఆరోగ్యశ్రీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం ఆరోగ్యశ్రీని నిర్లక్ష్యం చేస్తోంది' అని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రస్తుతం పేద, మధ్యతరగతి ప్రజల జీవనం చాలా కష్టంగా మారిందని, వైద్య సేవలను కూడా కూటమి ప్రభుత్వంపై ప్రజలకు దూరం చేస్తోందన్నారు. వైద్యం కోసం నిరుపేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తెచ్చారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆరోగ్యశ్రీ పథకాన్ని మరింత బలోపేతం చేశారన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పైసా ఖర్చు లేకుండా మెరుగైన వైద్యం అందించడంతో పాటు కోలుకునే వరకూ ఆర్థికసాయం అందించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి రూ. 25 లక్షలు ఆరోగ్య బీమా కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు తుంగలో తొక్కారన్నారు. ప్రజలను నమ్మించి గద్దెకెక్కిన చంద్రబాబు ప్రభుత్వం ఆరోగ్య బీమాను పది శాతానికి తగ్గించి రూ. 2.5 లక్షలకు బీమాకు పరిమితం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆరోగ్యశ్రీ పథకాన్ని పేద ప్రజలకు అందేలా పకడ్బందీగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్

హిందూపురం టౌన్: పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక మున్సిపల్ ఈసీ బాలుర పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి అంజనమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అశోక్ కుమార్ మాట్లాడుతూ పే రివిజన్ కమిషన్ నియమించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నూతన ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి అంజనమూర్తి , మండల ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

హిందూపురం: రోటరీ క్లబ్ స్టీఫెన్ హాకింగ్ డిజేబుల్, హెల్పింగ్ హాండ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని దివ్యాంగులకు ఉచితంగా నిత్యావసర సరుకులను అందజేశారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వై.బలరామిరెడ్డి హాజరై మాట్లాడారు. దివ్యాంగులు పట్టుదల స్వయం శక్తితో అన్నిరంగాల్లో ప్రతిభ కనబరిచేందుకు కృషిచేయాలన్నారు.

యువతి అదృశ్యం

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరుకు చెందిన సిరివెన్నెల అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు కియా పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాలతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు యువతి తల్లి కళావతి తెలియజేశారు. కుటుంబ సభ్యుల ఇళ్లు పరిసర గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు కియా ఏఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

పర్యాటకుల కోసం మెడికల్ క్యాంపు

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి ఆలయానికి వచ్చే పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని ప్రతి శని, ఆదివారాల్లో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు. పర్యాటకులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



అన్నిరంగాల్లో మేటి 'హిందూపురం'



'రియల్' వ్యాపారం

హిందూపురం: విద్య, వైద్యం, వ్యవసాయం, ఆటోమొబైల్స్, హోటళ్లు, చికెన్ వ్యాపారం, రియల్ ఎస్టేట్, పట్టుచీరల విక్రయాలు ఇలా అన్ని రంగాల్లోనూ హిందూపురం మేటిగా నిలుస్తోంది. జిల్లాలోనే అన్నివిధాలుగా వేగవంతంగా అభివృద్ధి సాధిస్తున్న పట్టణంగా పురం మారుతోంది. విద్యారంగంలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యాబోధనలు అందిస్తూ ఉన్నత స్థానాలు చేరుకునేలా అవకాశాలు కల్పిస్తున్నాయి. మంచి విద్యబోధనతో పాటు తరగతి గదులు, క్యాంపస్‌లను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది విద్యాబోధన సాగిస్తున్నాయి. విద్యతో పాటు క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి వాటితో విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందించేలా చేస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి బోధన అందిస్తూ ఉన్నత స్థాయికి చేరుకోవడానికి తోడ్పాటు అందిస్తున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల రాకపోకలకు సైతం బస్సు సదుపాయం కల్పిస్తూ విద్యార్థులకు ఏ ఇబ్బంది లేకుండా చూస్తున్నారు. దీనికి తోడు విద్యార్థులకు హాస్టల్ సదుపాయాన్ని కూడా అందుబాటులో ఉంచాయి.

విస్తరిస్తున్న ఆటోమొబైల్స్ రంగం

హిందూపురం ప్రాంతంలో ఆటోమొబైల్స్ రంగం వేగవంతంగా విస్తరిస్తోంది. కొత్తరకాల వాహనాలతో ప్రజల అభిరుచులకు అనుగుణమైన వాహనాలు దొరుకుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహన రంగంలో వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా సరికొత్త మోడల్స్‌తో పాటు కాలుష్యరహిత వాహనాలు కూడా ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. వాహనాల అమ్మకాలలో పోటీ పెరగడంతో ప్రజలకు ఆకర్షణీయమైన ఆఫర్స్‌ను ఇస్తున్నారు. విభిన్న రకాల వాహనాలు, సరసమైన ధరలతో రుణ సదుపాయం కూడా అందిస్తూ విక్రయాలు కొనసాగిస్తున్నారు.

విభిన్న రుచుల కేంద్రం 'పురం'

హిందూపురం పట్టణం విభిన్న రుచులకు కేంద్రంగా మారింది. పట్టణంలో స్థానికులకే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు కూడా మెచ్చే విధంగా మంచి రుచులతో శుచీ శుభ్రతతో పాటు పసందైన శాకాహారం, మాంసాహారం హోటళ్లు ఎన్నో ఉన్నాయి. మాంసాహార ప్రియుల అభిరుచులకు అనుగుణంగా వెరైటీ ఫుడ్ అందుబాటులోకి తెచ్చారు. దీనికి తోడు చికెన్ వ్యాపారాలు కూడా జోరుగా సాగుతున్నాయి.

అందుబాటులోకి అధునాతన వైద్యం

నగరాలకు పరిమితమైన మెరుగైన వైద్యసదుపాయాలు పురంలో అందుబాటులోకి వచ్చేశాయి. సాధారణ ఆరోగ్య సమస్యలతో పాటు అత్యవసర వైద్య సదుపాయం కూడా అందుబాటులో ఉన్నాయి. అలాగే మహిళలు, పిల్లలకు ప్రత్యేక వైద్య పరీక్షా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. నగరాలకే పరిమితమైన మెరుగైన ఆధునిక దంత వైద్యం కూడా ఇప్పుడు హిందూపురంలో లభ్యమవుతోంది. జిల్లాలోనే మొదటిసారి ఆధునిక వసతులతో కూడిన సంతాన సాఫల్య కేంద్రం కూడా వచ్చేసింది. పిల్లలు లేని వారికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తూ చికిత్స అందిస్తున్నారు. రోగ నిర్ధారణ కోసం సిటీ స్కానింగ్‌తో పాటు అన్ని రకాల స్కానింగ్‌లు, వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. ఎంఆర్‌ఐ స్కానింగ్ కోసం నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సదుపాయాలు ఉన్నాయి.

పట్టణ పరిసరాల్లో వెంచర్లు, ప్లాట్లు మెరుగైన సదుపాయాలతో ప్రజలు సొంతింటి కల నెరవేర్చుకునే అవకాశాలు అందుబాటులోకి తెచ్చారు. ఫ్లాట్లతో పాటు అపార్ట్‌మెంట్లు కూడా సరసమైన ధరలకే లభిస్తున్నాయి. భవిష్యత్తులో హిందూపురం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని కొనుగోలు దారులు స్థలాలు, భవనాల కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు.

అన్నీ ఇక్కడే ..

రైతులకు నాణ్యమైన విత్తనాలు, మందులు వ్యవసాయ పరికారాలు పట్టణంలోనే లభ్యమవుతున్నాయి. రైతుల పంటలు అమ్ముకునేందుకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అలాగే పట్టు చీరల వ్యాపారానికి హిందూపురం పెట్టింది పేరు. మగువ మనస్సుదోచే వివిధ రకాల కొత్త డిజైన్స్‌తో పట్టుచీరలు అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.























